క్లుప్తంగా

మహిళలను దూషించిన వారిపై కేసు

గుంటూరు ఈస్ట్: ఉద్యోగం ఇస్తామని పిలిచి స్పష్టమైన సమాధానం చెప్పకపోగా, మహిళలను అసభ్యకరంగా దూషించిన ఇద్దరిపై పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. పొన్నూరు రోడ్డులోని పంచవటి అపార్టుమెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో షేక్ అఫీన్, షేక్ ఆరీఫ్ బెటర్‌మెంట్ సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో ఓ సంస్థ నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రకటన ఇచ్చారు. ఫోన్‌లో సంప్రదించిన పలువురు ఆదివారం పొన్నూరు రోడ్డులోని సంస్థ కార్యాలయానికి వచ్చారు. ఉద్యోగం విషయంలో స్పష్టత ఇవ్వకుండా పొంతనలేని సమాధానం ఇచ్చారు. ఇదేమని ప్రశ్నించినవారిని దుర్భాషలాడారు. మహిళలను అసభ్య పదజాలంతో దూషించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు అఫీన్, ఆరీఫ్‌లను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సేవలకు ప్రతిరూపం లయన్స్ క్లబ్‌లు

నగరంపాలెం: లయన్స్ క్లబ్‌లు సేవలకు ప్రతిరూపమని క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 316 హెచ్ గవర్నర్ పరుచూరి గోపీచంద్ అన్నారు. జేకేసీ కళాశాల సమావేశం మందిరంలో ఆదివారం జిల్లా లయన్స్ క్లబ్స్ మొదటి కార్యవర్గ సమావేశం, క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారుల శిక్షణ తరగతులను నిర్వహించారు. ముఖ్యఅతిథి ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్, జిల్లా చీఫ్ అడ్వైజర్ నూతలపాటి వీరప్రకాష్‌రావు మాట్లాడుతూ 2024- 25లో యువతకు స్కిల్ డెవలప్‌మెంట్, పర్యావరణ పరిరక్షణ, క్యాన్సర్ వ్యాధిపై అవగాహన, నిరోధక సేవా కార్యక్రమాల నిర్వర్తించి, 316 హెచ్ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాలని సూచించారు. జిల్లా క్యాబినెట్ కార్యదర్శి వివి సుబ్బయ్య, కోశాధికారి డాక్టర్ సిహెచ్ చక్రపాణి, మాజీ గవర్నర్ కృపానందం, ఎంసీసీ శ్రీనివాసరావు, జోనల్, జిల్లాల చైర్మన్లు, సమన్వయకర్తలు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: పెళ్లి చేసుకుంటానని మహిళను నమ్మించి, మోసం చేసిన వ్యక్తిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బ్రాడీపేటకు చెందిన ఓ మహిళ, అంకిరెడ్డిపాలెంకు చెందిన ఓర్సు శివకృష్ణ రెండు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మహిళపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం పెళ్లి చేసుకునేందుకు నిరాకరించాడు. బాధితురాలు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఆషాఢ సారె మహోత్సవం



నగరంపాలెం: జగన్నాథ స్వామి కోలాట భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం కొత్తపేటలోని జగన్నాథ స్వామివారి దేవస్థానంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారికి ఆషాఢ సారె మహోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వార్లను దర్శించుకున్నారు. అనంతరం అమ్మవార్లకు కుంకుమ పూజ చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

రవీంద్రనగర్‌లో కవితా గోష్ఠి



నగరంపాలెం: స్థానిక రవీంద్రనగర్‌లోని కుర్తాళ శ్రీసిద్ధేశ్వరీపీఠ విభాగం మంత్రాశ్రమంలో ఆదివారం కవితా గోష్ఠి నిర్వహించారు. కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ స్వామీజీ ఆశీస్సులతో వ్యాస పూర్ణిమ సందర్భంగా కార్యక్రమం జరగ్గా, మంత్రాశ్రమ నిర్వహణాధికారి నరసింహానంద భారతీస్వామి ప్రారంభ ప్రవచనంతో సభ ప్రారంభమైంది. హిందూ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డీఎన్ దీక్షితులు అధ్యక్షత వహించి, వ్యాసుని గొప్పతనం, వ్యాస పూర్ణిమ వైశిష్ట్యాన్ని వివరించారు. పలువురు కవులు, పండితులు తమ కవితలను వినిపించారు. పి.హైమానంద్, కార్యవర్గ సభ్యుడు శ్రీరామకృష్ణ ప్రసాద వితరణ చేశారు.

ఆశ్రమ విద్యార్థులకు అన్నదానం

పొన్నూరు: మండలంలోని బ్రాహ్మణ కోడూరులో బాలల ఆశ్రమంలో మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల 2022-24 ఇంటర్ విద్యార్థులు, లెక్చరర్స్ మహేష్, దుర్గా, రాజకుమార్ సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు తిరుమల శెట్టి ఉమాశంకర్, తన్నీరు రవీంద్ర, గోపి భాస్కర్, శ్రీను, విజయ్, మేకనాథ్ జాహ్నవి, గుణశేఖర్, చైల్డ్ హోమ్ సభ్యులు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

గురువులను గౌరవించడం అందరి బాధ్యత

- నగరంలో పలు విద్యాసంస్థల్లో గురుపౌర్ణమి వేడుకలు
- గురువులకు సన్మానం



గురువులను సత్కరిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేంద్రకుమార్, సరస్వతి శిశు మందిర్ సిబ్బంది

గుంటూరు మెడికల్: గురువులను గౌరవించడం అందరి బాధ్యత అని పలువురు పేర్కొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా గుంటూరు సంపత్‌నగర్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో పలువురు గురువులను సత్కరించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పత్రి బిందు మాధవ్, రిటైర్డ్ లెక్చరర్ వెంకటేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, శ్రీ సరస్వతీ విద్యాపీఠం విజయవాడ సమితి కోశాధికారి వనమా నరేంద్ర కుమార్, శ్రీ సరస్వతి విద్యాపీఠం గుంటూరు విభాగ్ అధ్యక్షుడు వనమా పూర్ణచంద్రరావు, పాఠశాల కార్యదర్శి ప్రదీప్ కుమార్, శ్రీ సరస్వతి విద్యాపీఠం గుంటూరు విభాగ్ కార్యకారిణి సభ్యులు మాజేటి లక్ష్మి, పి.శ్రీనివాస్, ప్రధానాచార్యులు మీనా కుమారి, ఆచార్యులు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిందు మాధవ మాట్లాడుతూ మన దేశంలో గురువును దైవంగా భావిస్తుంటారని చెప్పారు. వేద వ్యాసుడు మానవజాతి అంతటికి మంచి ఆధ్యాత్మిక వారసత్వాన్ని మిగిల్చి వెళ్లాడని, ఆయనను మానవాళి అందరికీ గురువుగా భావిస్తారని పేర్కొన్నారు.

మహిళా విద్యాభివృద్ధికి బాటలు వేసిన ఉన్నవ దంపతులు

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలో మహిళా విద్యాభివృద్ధికి వందేళ్ల క్రితమే బాటలు వేసిన ఉన్నవ దంపతులు ఆదర్శ గురువులుగా నిలిచారని శ్రీశారదానికేతనం మహిళా విద్యాసంస్థల కరస్పాండెంట్ జి.శ్రీనివాసరావు తెలిపారు. బ్రాడీపేటలోని శ్రీశారదానికేతనంలో ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ శారదానికేతనం స్థాపకులైన ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మ దంపతులు మహిళలు విద్యావంతులుగా ఎదిగి, తమ కాళ్లపై తాము నిలబడాలనే ఉద్దేశంతో సంస్థను స్థాపించి, వేలాది మందిని విద్యా వంతులుగా తీర్చిదిద్దారని అన్నారు. ఈసందర్భంగా విశ్రాంత అధ్యాపకురాలు కె.రాజేశ్వరి, హైస్కూల్ విశ్రాంత హెచ్‌ఎం కె.దుర్గాభవానీ, రాజర్షి యోగా శిక్షణా అకాడమీ శిక్షకురాలు వై.శివపార్వతిని సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కోటి రత్నం, హైస్కూల్ హెచ్‌ఎం ఉషాకుమారి, ఉన్నవ కుటుం సభ్యురాలు హేమ పాల్గొన్నారు.

గుంటూరు మెడికల్: ఆషాఢ శుద్ధ పూర్ణిమ (గురుపౌర్ణమి) సందర్భంగా ఆదివారం బీజేపీ రాష్ట్ర పబ్లిసిటీ అండ్ లిటరేచర్ కన్వీనర్ పాలపాటి రవికుమార్ ఆధ్వర్యంలో పలువురు గురువులకు గుంటూరులో సన్మానించారు. రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు తమ విద్యారంగంతో పాటు పలు ఇతర రంగాలలో సేవలందించి తమ జీవితాలను సమాజ కల్యాణానికి అంకితం చేసిన గురువులను గుర్తించి వారి స్వగృహం వద్ద శాలువా కప్పి పూలదండ వేసి ఘనంగా సత్కరించారు. పట్టాభిపురం మున్సిపల్ హైస్కూల్ పూర్వ హెచ్‌ఎం గడియారం రామకృష్ణ, రమణి దంపతులు, జె.కె.సి కళాశాల తెలుగు డిపార్టుమెంటు పూర్వ సారధి పులిచర్ల సాంబశివరావు, భారతి దంపతులు, పి.ఈ.టి రాంబాబు, ప్రముఖ విద్యావేత్త, న్యాయవాది జూపూడి రంగరాజు, ప్రముఖ మహిళాభ్యుదయవాది జూపూడి హైమావతి తదితరులను సత్కరించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈదర శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మీడియా కో-కన్వీనర్ వెలగలేటి గంగాధర్, మండల అధ్యక్షుడు పెమ్మరాజు సుధాకర్, సురేష్ జైన్, బొలగాని సాంబయ్య, మహిళానేత బొల్లాప్రగడ శ్రీదేవి, జితేంద్ర గుప్త, ముత్యం నరేంద్ర పాల్గొన్నారు.

హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో...

గుంటూరు ఎడ్యుకేషన్: క్రమశిక్షణతో కూడిన నడవడికతో విద్యార్థులు గురువు నేర్పిన విద్యకు సార్థకత చేకూర్చాలని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ అన్నారు. ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్వీ రమణతో పాటు కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపక బృందాన్ని సత్కరించారు. భారతీయ శిక్షణ మండల్ ఆధ్వర్యంలో హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు తమ గురువులను సత్కరించుకున్నారు. ఎంబీఏ విభాగాధిపతి వి.చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్లు డి.కళ్యాణి, డాక్టర్ గోపి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పండితులకు సత్కారం...

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో గురుపూర్ణిమ సందర్భంగా దేవాలయ పాలకమండలి, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ సంయుక్తంగా ఆదివారం ఐదుగురు పండితులను సత్కరించారు. సాయంత్రం తిరుప్పావై అమృతవర్షిణి డాక్టర్ కోగంటి వెంకట శ్రీరంగనాయకి, భాగవత గోష్ఠి బృందం విష్ణు, లలిత సహస్రనామ, కనకధార స్తోత్ర పారాయణం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సిహెచ్. మస్తానయ్య, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



రాజేశ్వరిని సత్కరిస్తున్న శ్రీనివాసరావు, కోటి రత్నం, ఉషాకుమారి



ఎస్వీ రమణను సత్కరించిన అధ్యాపక బృందం



ఐదుగురు పండితులను సత్కరిస్తున్న దృశ్యం

సమీకృత వసతి గృహ నిర్మాణం పూర్తి చేయాలి

లక్ష్మీపురం: స్థానిక బి.ఆర్.స్టేడియం సమీపంలో ఉన్న కోడిగుడ్ల సత్రంలో నిర్మిస్తున్న సమీకృత సంక్షేమ భవన్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2011వ సంవత్సరంలో ప్రారంభమైన ఈ వసతి గృహ పనులు ఇంకా పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా కూడా వారు కనీసం పట్టించుకోలేదన్నారు. మరోపక్క గుంటూరు నగరంలో బీసీ హాస్టల్‌కు కనీసం ఒక్క శాశ్వత భవనం కూడా లేదన్నారు. నాలుగు జిల్లాల నుంచి చదువుకోవడానికి వచ్చే ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద వర్గాల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే ఈ సంక్షేమ భవన్ పనులను తక్షణమే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం నగర కార్యదర్శి యశ్వంత్, డేవిడ్, కిరణ్, గణేష్, బన్నీ, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

దిగజారుతున్న విద్యానాణ్యత ప్రమాణాలు

లక్ష్మీపురం: ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులు సాధారణ కూడికలు కూడా చేయలేకపోతున్నారని సొంత భాషలో వాడుకలో ఉన్న పదాలను సైతం రాయలేకపోతున్నారని విద్యావేత్త బి.సి.హెచ్.అనంతరామయ్య అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో విద్యా నాణ్యత ప్రమాణాలు దారుణంగా దిగజారుతున్నాయన్న ఐక్యరాజ్యసమితి బాలల సంక్షేమ విభాగం యూనిసెఫ్ తన తాజా నివేదికలో ఆందోళన వ్యక్తం చేయడంపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విద్యా విషయాల విశ్లేషకులు ఆర్.వి. సింగరయ్య, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సంస్థ సీనియర్ సభ్యులు ప్రసంగించారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు



గణేశ్వరరావు వీధిలోని ఆలయంలో పూజలు

నగరంపాలెం: గుంటూరు నగర పురవీధుల్లో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలను సర్వాంగ సుందరంగా అలకరించారు. సాయిబాబా ఆలయా ల్లో ప్రత్యేక పూజలు చేశారు. బాబా భజ నలు, సంకీర్తనలతో మందిరాలు మారుమోగాయి.

కొత్తపేటలో..

స్థానిక కొత్తపేట గణేశ్వరరావు వీధిలో కొలువైన షిరిడీ సాయిబాబా ధ్యాన మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు జరగ్గా, ఆలయ పూజారి చైతన్యశర్మ వేకువ జామున బాబా వారికి కాగడ హారతి, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం లలితా సహస్ర నామాలు ముత్తయిదువులతో పారాయణం చేయించారు. ధ్యాన మందిరం నిర్వాహకులు వేపూరి లక్ష్మీనరసింహారావు, స్నేహ పరిమళం సభ్యులు అంకమ్మరావు స్వరరాగ సుధాసాయిలను సత్కరించారు.

హౌసింగ్‌బోర్డు కాలనీలో..

నగరంపాలెం: స్థానిక హౌసింగ్‌బోర్డుకాలనీ షిరిడీ సాయినాథ మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించగా, బాబా వారికి పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, అర్చన కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు మామిడి సీతారామయ్య, మామిడి రామారావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

బృందావన్ గార్డెన్స్‌లో..

స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో గురుపౌర్ణమి సందర్భంగా శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి, జయేంద్రసరస్వతిస్వామి, విజయేంద్ర సరస్వతి స్వామి చిత్రపటాలతో ఆలయ ప్రదిక్షణతో గురుపూజ, విశేష పూజలు నిర్వహించారు. ధార్మిక ప్రాంగణంలో గణపతి, చండీ రుద్రహోమాలు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో విశ్వకల్యాణాన్ని కాంక్షిస్తూ అత్యంత భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సూర్యదేవర వెంకటేశ్వర్లు, కూర్మనాధన్, కొర్రపాటి నాగేశ్వరరావు, గోపీచంద్ పాల్గొన్నారు.



సుధాసాయి వారికి సత్కారం

వికాస్‌నగర్‌లో..

స్థానిక వికాస్‌నగర్ షిర్డీసాయి మందిరంలో గురుపౌర్ణమి మహోత్సవాల ముగింపు జరిగింది. ఉదయం షిర్డీసాయికి విశేష అలంకారం, ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. మందిరం అధ్యక్షులు పూర్ణచంద్రరావు దంపతులు, సత్సంగ్ సభ్యులు పాల్గొన్నారు.

సిద్ధార్థ నగర్‌లో..

స్థానిక సిద్ధార్థనగర్ కనకమహాలక్ష్మీ మందిర ప్రాంగణంలోని సాయిబాబా ఆలయంలో స్వామి వారికి విశేష అభిషేకార్చనలు జరిగాయి. విశేష హారతి అనంతరం తీర్థప్రసాద వితరణ జరగ్గా, వ్యవస్థాపక అధ్యక్షుడు విజయస్వామి పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

నగరంపాలెం: స్థానిక విద్యానగర్ మూడో వీధిలోని శ్రీసాయినాథ సన్నిధానంలో గురుపౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆదివారం ఉదయం అభిషేకాలు, అర్చనలు అనంతరం స్వామి వారి విశేష దర్శనానికి భక్తులు బారులుతీరారు. గుంటూరు పశ్చిమ, పెదకూరపాడు ఎమ్మెల్యేలు గల్లా మాధవి, భాష్యం ప్రవీణ్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, కార్పొరేటర్లు వేములపల్లి శ్రీరాంప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, నూకల బాలాజీ, భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల కోలాటం అలరించింది. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు యడ్లపాటి అశోక్‌కుమార్, అధ్యక్షుడు వడ్లమూడి శివరామకృష్ణయ్య, సుధీష్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఆదిగురువు జాంబవ దేవునికి పూజలు



ఆదిగురువు జాంబవ దేవునికి పూజలు చేస్తున్న మాజీ మంత్రి డొక్కా, మాదిగ నేతలు

స్థానిక అరండల్‌పేట మోహనరంగ నాయక స్వామి దేవాలయంలో ఆదిగురువు జాంబవ మాదిగ దేవుడికి గురుపూర్ణిమ మహోత్సవం జరిగింది. స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అందించారు. మాజీ మంత్రులు డొక్కా మాణిక్యవరప్రసాద్, రావెల కిషోర్‌బాబు, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, పలు రాష్ట్రాల మాదిగ పూజారులు, స్థానిక నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



హౌసింగ్‌బోర్డులో సాయిబాబాకు హారతిస్తూ..



స్వామి వారిని దర్శించుకున్న పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి

కార్యకర్తలకు అన్నివిధాలా అండగా ఉంటాం



ఇటీవల మృతిచెందిన కార్యకర్తల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నూరి ఫాతిమా

- వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నూరిఫాతిమా
- ఇటీవల మృతిచెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ, ఆర్థికసాయం

నెహ్రూనగర్: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అన్నివిధాలుగా అండగా ఉంటామని పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఎల్ఆర్ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ 17వ డివిజన్ కన్వీనర్ గురవయ్య బాబు, నాయకుడు గాలయ్యలు ఇటీవల మరణించిన నేపథ్యంలో ఆయా కుటుంబ సభ్యులను నూరిఫాతిమా ఆదివారం పరామర్శించారు. ఆమె తనవంతు ఆర్థిక సాయం చేసి భవిష్యత్‌లో తను అన్నివిధాలుగా తోడు ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తల పార్టీ అని, కార్యకర్తలకు అన్నివిధాలుగా అండగా ఉంటామని స్పష్టం చేశారు. స్థానిక కార్పొరేటర్ ఫర్జాన, పార్టీ ముఖ్య నాయకులు బికారీ మేస్త్రి, ఆయుబ్ జానీ, రబ్బానీ, మరియదాస్, పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు.

లింగస్వామి హంతకులను కఠినంగా శిక్షించాలి

నెహ్రూనగర్: నంద్యాల జిల్లా పాములపాడు మండలంలోని ఇస్కాల్ గ్రామంలో రజక కులానికి చెందిన లింగస్వామిని దారుణంగా చంపిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రజకులపై దాడులు అధికమైపోయాయని, ప్రభుత్వం శాంతి భద్రతలను కాపాడి రజకులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

పేద వృద్ధులకు పెన్షన్ల పంపిణీ



వృద్ధులకు పెన్షన్లు అందజేస్తున్న రాంబాబు, కేవీ బ్రహ్మం, మద్దు రామకృష్ణయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ - ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ఆగస్టు 20న ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు రూ.20 లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేయనున్నట్లు అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు తెలిపారు. ఆదివారం అరండల్ పేటలోని సంస్థ కార్యాలయంలో గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన 108 పేదలకు పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ అతిథిగా పాల్గొన్న మద్దు రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మద్దు రామకృష్ణయ్య మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ప్రతి నెల 108 మందికి రూ.500 చొప్పున పెన్షన్లు ఇవ్వడతో పాటు వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించి, ఔషధాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సివిల్స్ శిక్షణ పొందే విద్యార్థులకు రూ.3 లక్షల విరాళాన్ని ప్రకటించారు. గురుపౌర్ణమి సందర్భంగా వ్యాస మహర్షికి పూజలు నిర్వహించారు. డాక్టర్ వైదేహి గురుపౌర్ణమి విశిష్టతను తెలియజేశారు. అవోపా రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు చింతా కృష్ణారావు, నగర కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మద్ది సాయి రమేష్, మట్టుపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

నెహ్రూనగర్: ప్రజల నుంచి తాగునీటి సరఫరా, వీధి దీపాలు, ఇతర సమస్యలపై సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో అర్జీలు స్వీకరిస్తామని నగర అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య విభాగాధిపతులు, డెప్యూటీ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు.

క్విజ్ పోటీల విజేత 'ఆంధ్ర మెడికల్ కళాశాల'



స్టాల్ నిర్వాహకులతో రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ విజయ

గుంటూరు మెడికల్: గుంటూరులో గత మూడు రోజులుగా జరుగుతున్న ఏపీ న్యూరో కాన్ -2024 రాష్ట్ర సదస్సులో పీజీ వైద్య విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి ఆంధ్ర మెడికల్ కళాశాలకు దక్కింది. డాక్టర్ రవిశంకర్, డాక్టర్ తేశ్వరరావు, డాక్టర్ పి.ఎస్.ఎస్.వి. హరితలు న్యూరో నాయిడ్స్ ఏఎంసీ పేరుతో క్విజ్ పోటీలో పాల్గొని ప్రథమ బహుమతి దక్కించుకున్నారు. గుంటూరు మెడికల్ కాలేజీకి చెందిన డాక్టర్ ముబషీర్, డాక్టర్ భాను చంద్రప్రసాద్, డాక్టర్ కృష్ణ ప్రియ, డాక్టర్ సిద్ధార్థ, డాక్టర్ కార్తీక్ రెడ్డి, డాక్టర్ కె.ఎస్.కాంతిమ, డాక్టర్ ఎం.డి. అజ్మా, డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ పి.లక్ష్మీభావన, డాక్టర్ జె.వి.రాందేవ్, డాక్టర్ జి.సాయితేజ్, డాక్టర్ కె.అక్షయ్‌లు ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు.

- బెస్ట్ రీసెర్చ్ పేపర్ అవార్డు న్యూరో సర్జరీలో సిద్ధార్థ మెడికల్ కళాశాలకు చెందిన డాక్టర్ ఎం.కృష్ణమణికుమార్, బెస్ట్ రీసెర్చ్ పేపర్ అవార్డు న్యూరాలజీలో నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాలకు చెందిన డాక్టర్ మెర్సి వీజేలు అవార్డులు పొందారు.
- బెస్ట్ పోస్టర్ న్యూరాలజీ విభాగంలో విశాఖపట్నం 7 హిల్స్ హాస్పటల్‌కు చెందిన డాక్టర్ అమరపు శ్రవంతి, గుంటూరు లలితా హాస్పటల్‌కు చెందిన డాక్టర్ యశ్వంత్, డాక్టర్ ఉషా బెహరాలు అవార్డులు పొందారు.
- బెస్ట్ పోస్టర్ న్యూరో సర్జరీ విభాగంలో స్విమ్స్‌కు చెందిన డాక్టర్ ఎస్.సాత్విక్, ఎన్నారై మెడికల్ కళాశాలకు చెందిన డాక్టర్ ఎ.వి.శరత్‌చంద్రలు అవార్డులు పొందారు.
- బెస్ట్ ఫ్రీ పేపర్ విభాగంలో న్యూరో సర్జరీకి స్విమ్స్‌కు చెందిన డాక్టర్ ఎస్.సాత్విక్, కిమ్స్‌కు చెందిన డాక్టర్ పి.వి.సత్యేంద్ర, న్యూరాలజీ విభాగంలో నిమ్స్‌కు చెందిన డాక్టర్ కీర్తిశ్రీ, సిమ్స్‌కు చెందిన డాక్టర్ కాంతం శరత్‌లు అవార్డులు పొందారు. క్విజ్ విజేతలకు ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఇంజేటి బాబ్జి శ్యామ్‌కుమార్, న్యూరోకాన్ 2024 రాష్ట్ర సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ ఎస్.వి.సుందరాచారి, డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డాక్టర్ వి.రామ్‌తారక్‌నాథ్‌లు బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు.

ఆకట్టుకున్న పలు కంపెనీల స్టాల్స్

గుంటూరు మెడికల్: గుంటూరులో శుక్రవారం నుంచి జరుగుతున్న ఏపీ న్యూరోకాన్ -2024 రాష్ట్ర సదస్సులో పలు ఫార్మాస్యూటికల్ కంపెనీలు, సర్జికల్ కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రదర్శనగా ఎగ్జిబిషన్స్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఏపీ న్యూరోకాన్-2024 కాన్ఫరెన్స్‌కు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన న్యూరాలజీ వైద్యులు, న్యూరో సర్జన్లు ఈ ప్రదర్శనలో ఏర్పాటుచేసిన వివిధ ఫార్మాస్యూటికల్ కంపెనీల స్టాల్స్‌ను సందర్శించి న్యూరాలజీ చికిత్సల్లో వినియోగించే వివిధ రకాల మందులను, నూతనంగా మార్కెట్లోకి విడుదల చేసిన మందుల గురించి తెలుసుకున్నారు. యూహెచ్‌సీ రెమిడీస్ ఫార్మాస్యూటికల్ సంస్థ స్టాల్‌ను పలువురు న్యూరాలజీ ప్రముఖులు సందర్శించి అభినందించారు. ఏపీ న్యూరోకాన్-2024 ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షురాలు, లలిత హాస్పిటల్ అధినేత డాక్టర్ పమిడి ముక్కల విజయ తమ స్టాల్‌ను సందర్శించి అభినందనలు తెలిపారని యూహెచ్‌సీ రెమిడీస్ డివిజనల్ బిజినెస్ మేనేజర్ ప్రశాంత్ తెలిపారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తమ స్టాల్‌ను సందర్శించి అభినందనలు తెలిపారని పేర్కొన్నారు.

దంత వైద్య శిబిరానికి విశేష స్పందన

తెనాలిఅర్బన్: దంతాల సంరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని దంత వైద్యనిపుణురాలు డాక్టర్ ఓగిరాల హిమబిందు సూచించారు. రక్షణ సైన్యం సంస్థ ఆధ్వర్యంలో అయితానగర్‌లోని చర్చి వద్ద ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దంతాలను ప్రతిరోజు శుభ్రం చేసుకోవాలన్నారు. అలాగే నోటి దుర్వాసన రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం ఆమె దంత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా ఇచ్చారు. చర్చి పాస్టర్ మేజర్ నాగరాజు, రత్న సుందరి, సంఘ పెద్దలు గాలి రవికుమార్, పిల్లి కనకరత్న, కారుమంచి నరసింహారావు, ఆశీర్వాదం పాల్గొన్నారు.

వైరల్ ఇన్‌ఫెక్షన్ల వల్లే సీజనల్ శ్వాసకోశ వ్యాధులు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకట కల్యాణ్

లక్ష్మీపురం: ఈ సీజన్‌లో దగ్గు, జలుబు లాంటి శ్వాస కోశ వ్యాధులు రావడం సహజమని వీటి కోసం అనవసరంగా యాంటీబయాటిక్స్ వాడి వ్యాధి నిరోధక శక్తిని తగ్గించుకోవద్దని ప్రభుత్వ సమగ్రాసుపత్రి వైద్యుడు డాక్టర్ వెంకట కల్యాణ్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థకార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో ఎక్కడ చూసినా జ్వరాలు, దగ్గు, జలుబు లాంటివి కనిపిస్తున్నాయని, వాటి పట్ల అతి భయం అవసరం లేదని రెండు రోజులు వేచి చూసి తగ్గక పోతే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. ఇంటి చిట్కాలతోనే వ్యాధులు తగ్గు ముఖం పడతాయన్నారు. చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకే మందుల షాపులు, లేబొరేటరీలు, డాక్టర్ల వద్దకు వెళ్లి ఇళ్లు, ఒళ్లు గుల్ల చేసుకోవద్దని సూచించారు. అనంతరం డాక్టర్ వెంకట కల్యాణ్‌ను సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు.